www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

EDITOR : R.NAGI REDDY AKSHARA RAJAMUDRA TELUGU DAILY



WANTED

విలేకరులు కావలెను

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత

వివరాలకు..
9182 474 575

రాజముద్ర తెలుగు దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా
నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని
కోరుకుంటున్నారా?
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అన్ని
జిల్లాలు, మండలాల్లో రిపోర్టర్లుగా
పనిచేసేందుకు రండి..
మీ కలాలకు పదును పెట్టండి..



సంపుటి : 01 సంచిక : 65 మల్కాజిగిరి గురువారం 04 మార్చి 2024 పేజీలు : 4 వెల : రూ. 3/-




2లో

## వందరోజుల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను వదలబోం

బిఆర్ఎస్ గెలిస్తేనే అసెంబ్లీలో పోరాడగలం

కాంగ్రెస్‌కు అభ్యర్థులు లేక బిఆర్ఎస్‌కు గాలం

కెసిఆర్ రాగానే భయంతో.. కాల్వల్లోకి నీళ్లు వదిలారు

భువనగిరి పార్లమెంట్ సమీక్షలో హరీష్ రావు

### రేవంత్‌పై అవాకులు చవాకులు మానాలి



2లో

ఫోన్ ట్యాపింగ్‌లో చట్ట ప్రకారమే చర్యలు

ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి తీరుతాం

మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ



2లో

## సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం

ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలి మంటలు

మేనేజర్ రవి సహా మరో ఆరుగురు మృత్యువాత

సహాయక చర్యలు ముమ్మరం...రంగంలోకి దిగిన ఫైరింజన్లు



# కాంగ్రెస్ ప్రభుత్వానికి నీటి నిర్వహణ చేసే తెలివి లేదు

కొండా సురేఖ మెదడులేని విమర్శలు చేస్తోంది: మాజీ మంత్రి కేటీఆర్

చట్ట వ్యతిరేక వ్యవహారాలు, ఫోన్ ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు

చనిపోయిన రైతుల వివరాలు సీఎంకు పంపిస్తామని వెల్లడి

**మిషన్ భగీరథ నిర్వహణ కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.**

**హైదరాబాద్:** 'నాకు ఎలాంటి చట్ట వ్యతిరేక వ్యవహారాలతో, ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం లేదు. ఫోన్ ట్యాపింగ్ అంటూ లీకు వీరుడు రేవంత్‌రెడ్డి నా వ్యక్తిత్వ హననానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ఆయనకు మీడియా సమావేశం పెట్టి ఆధారాలు బయట పెట్టే దమ్ము లేదు. పోలీసు రిమాండులో ఉన్న వారి ఫోన్ల నుంచి కూడా లీకులు వస్తున్నాయి. నేను ఎవరో హీరోయిన్లను బెదిరించినట్లు మంత్రి కొండా సురేఖ మెదడు లేని విమర్శలు చేస్తోంది.

ఇలాంటి దిక్కుమాలిన పనులు చేయాల్సిన కర్మనాకేంటి? ఎవరి ఫోన్లూ ట్యాపింగ్ చేయాల్సిన, బెదిరించాల్సిన అవసరం మాకు లేదు. అడ్డగోలుగా చెత్త మాటలు మాట్లాడితే మంత్రి అయినా ముఖ్యమంత్రి అయినా తాటతీస్తాం.. న్యాయపరంగా ఎదుర్కొంటాం..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో బుధవారం పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ట్యాపింగ్‌పై 2004 నుంచే విచారణ జరిపించాలి '2011లో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు, అప్పుడు ఎంపీలుగా ఉన్న రాజగోపాల్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు తమ ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నాడని ఆరోపించారు. అందువల్ల విచారణ పరిధి పెంచి 2014 నుంచి కాదు 2004 నుంచి ట్యాపింగ్ అంశంపై విచారణ జరిపించాలి. పోలీసు అధికారులు మహేందర్‌రెడ్డి, శివధర్‌రెడ్డి, రవిగుప్తా తదితరులు 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ కీలక పోస్టుల్లో పనిచేశారు. కేసీఆర్ మాత్రమే బాధ్యులు అని లీకులు ఇస్తున్నవారు ఆ అధికారులను ఎందుకు విచారణకు పిలవడం లేదు. గతంలో నా ఫోన్ మీదా నిఘా ఉన్నట్లు ఆపిల్ సంస్థ నుంచి మెసేజ్ వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ అంటూ యూ ట్యూబ్‌లు, పనికి మాలిన ఛానళ్లకు రిమాండు రిపోర్టు పేరిట లీకులు ఇస్తున్నారు..'అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం

'రుణమాఫీపై వెకిలిగా నవ్వుతున్న రేవంత్‌రెడ్డి మొగోడు అయితే రైతులకు ఊరటనివ్వాలి. కాళేశ్వరం, గొర్రెలు..బర్రెల స్కీంలో అవినీతి, ఫోన్ ట్యాపింగ్ అంటూ రోజుకో అంశం తెరమీదకు తెస్తూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నాడు.

# రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు పక్కా చర్యలు

ప్రశాంతంగా ఎన్నికలకు భారీగా ఏర్పాట్లు

ఎన్నికల ప్రధానికారితో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్



**హైదరాబాద్:** రాష్ట్రంలో శాంతియుతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై భారత ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్, కేంద్ర ఎన్నికల కమీషనర్లు జ్ఞానేశ్వర్ కుమార్, డా. సుఖ్ బీర్ సింగ్ సంధు లతో కలసి అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, డీజీపీ రవీ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. రాష్ట్రంలో శాంతియుతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వివరించారు. రాష్ట్రంలో మొత్తం మీద శాంతి భద్రతల పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంది ప్రశాంతంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు జిల్లాలపై, పొరుగు రాష్ట్రమైన ఛత్తీస్ గఢ్ తో సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు, తెలంగాణా కు 860 కిలోమీటర్ల నాలుగు రాష్ట్రాల సరిహద్దు ఉందని, 154 చెక్ పోస్టులు తెరిచామని తెలిపారు. పోలీసు, ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్, రవాణా శాఖలు సరిహద్దు రాష్ట్రాలతో కోఆర్డినేషన్ సమావేశాలను నిర్వహించాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ. 69 .66 కోట్లను స్వాధీన పర్చుకున్నామని, వీటిలో రూ. 27 .38 నగదు, 10 కోట్ల విలువైన మద్యం, రూ. 16 .14 విలువైన డ్రగ్స్, నార్కోటిక్స్ స్వాధీన పర్చుకోగా, రూ. 7 .49 కోట్ల విలువైన మెటల్స్ స్వాధీన పర్చుకున్నామని వివరించారు. రాష్ట్రానికి 60 కంపెనీల కేంద్ర పారా మిలటరీ బలగాలు వచ్చాయని, మరో 100 కంపెనీల బలగాలు త్వరలోనే రానున్నాయని వివరించారు. మర్చి 16 వతేదీ నుండి ఇప్పటి వరకు 6022 మందిని బైండ్ ఓవర్ చేశామని తెలియచేసారు.

# పర్యావరణ విధ్వంసంతో ఉష్ణోగ్రతల్లో మార్పు
# ఎప్పుడూ లేనంతగా రికార్డుస్థాయి ఎండలు

**న్యూఢిల్లీ:** పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం,ప్యారిస్ ఒప్పందానికి అనుగుణంగా నడచుకోక పోవడం వంటి కారణాలతో దేశంలో ఏటేలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. హిమానీ నదాలు కరగి పోతున్నాయి. దీంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు సాధారణం అయ్యాయి. దేశంలో గత 122 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా మార్చి నెలలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. పశ్చిమ అలజడులు లేకపోవడం వల్ల వర్షపాతంలో లోటు ఏర్పడిందని, అందుకే ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని వివరించింది. గతేడాది తక్కువ వర్షపాతం నమోదైందని, అది సాధారణం కన్నా 71 శాతం తక్కువని తెలిపింది. 1901 మార్చి నుంచి ఇంత తక్కువ నమోదు కావడం ఇది మూడోసారని చెప్పింది. రాష్ట్రంలో భానుడు భగ్గు మంటున్నాడు. గరిష్ట ఉష్ణోగ్రతలు 43.2 డిగ్రీలు దాటుతుండటంతో ఇండ్ల నుంచి బయటికొచ్చేందుకు జనం జంకుతున్నారు. వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంటోంది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల లోపు బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్టు వెల్లడించింది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వైద్యారోగ్యశాఖ సూచించింది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరింది. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మంగళవారం సలహాలు, సూచనలు జారీ చేశారు. ఎండలో పనిచేయడం, ఆటలాడటం చెప్పులు లేకుండా బయట తిరగడం వంటివి చేయవద్దని చెప్పారు. పార్క్ చేసిన వాహనాల్లోకి పిల్లలు, పెంపుడు జంతువులు వెళ్లకుండా చూడాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో వంటగదికి దూరంగా ఉండటం మంచిదని సూచించారు. మద్యం, చాయ్, కాఫీ, స్వీట్స్, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. శరీర ఉష్ణోగ్రతలు 40.5 సెంటిగ్రేడ్ కంటే ఎకువగా నమోదవడం, విపరీతమైన చెమట, దాహం వేయడం, మగత, బలహీనత, తలతిప్పడం, కండరాలు పట్టేయం వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలని సూచించారు. జంటనగరాల్లోనూ ఎండలు మండుతున్నాయి. గ్రేటర్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో 41-42 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంగా 2-3 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండడంతో వడగాల్పుల ప్రభావం అధికంగా కనిపిస్తోంది. జనసంచారం తగ్గి రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అత్యధికంగా మూసాపేట- 41.9, ఖైరతాబాద్, చందానగర్- 41.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



## వందరోజుల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి

**యాదాద్రిభువనగిరి:** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరు పడగొట్టరని.. ఆ పార్టీలోని నేతల గ్రూప్ రాజకీయాలే పడగొడతాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. బుధవారం భువనగిరి పార్లమెంట్ నియోజవకర్గ సమీక్ష సందర్భంగా మాట్లాడుతూ... వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. మహాలక్ష్మి పేరుతో మహా మోసం చేశారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఓడించాలని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి 6 గ్యారెంటీలను అమలు చేసేలా పోరాడుతామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రైతులను పరామర్శించడానికి బయలుదేరగానే రేవంత్ భయపడి కాల్వలోకి నీళ్లు వదిలేలా అధికారులను ఆదేశించారని చెప్పారు. కాంగ్రెస్‌కి పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులు లేరని.. అందుకనే తమ పార్టీ నుంచి బలవంతంగా చేర్చుకుంటున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికల తర్వాత కరెంట్ బిల్లు పెంచుతారని...అన్ని రకాల ఛార్జీలు పెరుగుతాయన్నారు. బీజేపీ పాలనలో అన్ని ధరలు పెంచారని ధ్వజమెత్తారు. బీజేపీ నేతలు అయోధ్య రామాలయం కట్టి , అక్షింతలు పంచి రాజకీయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాముడు అందరికీ దేవుడని బీజేపీ నేతలు గుర్తుంచుకోవాలని చెప్పారు. తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నలుగురు అభ్యర్థులు దానం నాగేందర్, కడియం కావ్య, పట్నం సునీత, రంజిత్ రెడ్డి ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానానికే పరిమితమవుతారని అన్నారు. ఈ యాసంగిలో రైతుల ధాన్యాన్ని క్వింట రూ. 2500కు ప్రభుత్వం కొనాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉన్నత కాలం బీఆర్ఎస్ ఉంటుందని చెప్పారు. ఈ కష్టకాలంలో తమ పార్టీని వదిలిపెట్టి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఏ నాయకులను వదిలిపెట్టమని.. కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా.. మళ్లీ పార్టీలోకి రానివ్వబోమని హరీష్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ అంటేనే లీకులే, ఫేక్ న్యూస్‌లు. పాలన గాలికొదిలేసి అక్రమ కేసులతో కాలయాపన చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు మండిపడ్డారు. ఈ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండమని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ సాకుతో హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మాట తప్పిందని ఆరోపించారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తాం అని మోసం చేశారు. కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. కార్యకర్తలు కాంగ్రెస్ మోసాలను గ్రామాల్లో విడమర్చి చెప్పాలన్నారు. క్యామ మల్లేష్ మాస్ లీడర్. భువనగిరిలో తప్పకుండా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. స్వయానా రాహుల్ గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేసి పార్టీ నుంచి సస్పెండ్ అయిన వ్యక్తి భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అని ఎద్దేశా చేశారు. అసెంబ్లీలో కొట్లాడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలువాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాలను నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేనని స్పష్టం చేశారు. కార్యకర్తలు అంతా ఉద్యమ స్ఫూర్తితో పోరాటం చేయాలన్నారు.

## రేవంత్‌పై అవాకులు చవాకులు మానాలి

**హైదరాబాద్,:** ఫోన్ ట్యాపింగ్ అంశం రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. ఫోట్ ట్యాపింగ్ వ్యవహారంపై అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా ఈ అంశంపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం మంచిది కాదన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్‌లో అందరూ బయటకి వస్తారన్నారు. అందరి ఫోన్‌లు ట్యాప్ చేశారని.. విచారణలో అన్నీ బయటకు వస్తాయని తెలిపారు. కేటీఆర్ నోటీసులు ఇచ్చుకుంటే ఇచ్చుకో అని అన్నారు. తాము పద్ధతి ప్రకారం పనిచేస్తామన్నారు. మిషన్ భగీరథ తప్పుడు స్కీం అని వ్యాఖ్యలు చేశారు. తాము తెచ్చిన వాటర్ మేకానిజం కంటిన్యూ చేయొద్దని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తప్పు అని అన్నారు.
తమ ప్రభుత్వం గురించి కేటీఆర్ రైతులను అడిగితే తెలుస్తుందని.. తాము ఏం చేస్తామో సంవత్సరంలో చేసి చూపిస్తామన్నారు. రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. పూర్తి స్థాయి బడ్జెట్‌లో రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి రైతును మోసం చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో నాటి సీఎం, వ్యవసాయ మంత్రికి రైతుల కోసం ఎన్ని విజ్ఞాపనలు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో వర్షాలుపడలేదని.. కాంగ్రెస్ పాలనలో కరువు వచ్చిందని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ది కోసం బీఆర్ఎస్ హడావిడి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యలు చేశారు.

## కేజ్రీవాల్ అరెస్ట్‌పై ఢిల్లీ హైకోర్టులో వాదనలు
## తీర్పును నేడు ప్రకటించనున్న ధర్మాసనం

**న్యూఢిల్లీ:** దిల్లీ మద్యం కుంభకోణం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను ఈడీ అరెస్టు చేసింది. దీనిని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వ్యాజ్యాన్ని విచారించిన అనంతరం జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. గురువారం తీర్పు వెలువడే అవకాశం ఉంది. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టులో వాదనలు వినిపించారు. రాబోయే ఎన్నికల్లో మొదటి ఓటు వేయకముందే ఆప్ పార్టీని కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్నారని వాదించారు. కేజ్రీవాల్ తరపు న్యాయవాది సింఘ్వీ మాట్లాడుతూ ఇది చాలా ముఖ్యమైన కేసు అని కోర్టుకు తెలిపారు. అరెస్టు కారణంగా ఆయన లోక్‌సభ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేరని చెప్పారు. రాజ్యాంగ విరుద్ధంగా అరెస్టు చేశారని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఈడీ తరపున ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. ఈ కేసులో డిజిటల్ ఆధారాలను ధ్వంసం చేశారని కోర్టుకు చెప్పారు. లిక్కర్ కేసులో డబ్బుకు సంబంధించి న వ్యవహారాన్ని గుర్తించామని హవాలా ద్వారా వందకోట్ల రూపాయలు ఆప్ పార్టీకి అందాయని చెప్పారు. వాటిని గోవా ఎన్నికల్లో ఖర్చు చేశారన్నారు. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అన్ని నిర్ణయాలు ఆయనే తీసుకుంటారని, ఆప్ మీడియా ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్ లిక్కర్ కేసులో కీలకపాత్ర వహించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఏప్రిల్ 15 వరకు జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలుకు తరలించారు. ఘటనపై ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ స్పందించారు. ఎన్నికల సమయంలో ప్రచారం చేయకుండా అడ్డుకునేందుకు ఆయనను జైల్లో పెట్టారని ఆరోపించారు. ఈ నియంతృత్వ పాలనకు దేశ ప్రజలు సమాధానం చెబుతారని హెచ్చరించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడమే బీజేపీ, ఈడీల లక్ష్యమనే విషయం అర్థమైందన్ని ÷ర్ అయ్యారు.

## సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం



సంగారెడ్డి: జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. హత్నూర మండలం చందాపూర్ వద్ద ఉన్న ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో బుధవారం రియాక్టర్ పేలి మంటలు భారీగా వ్యాపించాయి. ఈ అగ్ని ప్రమాదంలో పరిశ్రమ డైరెక్టర్ రవితో పాటు మరో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలార్పేందుకు ప్రయత్నిస్తున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఫ్యాక్టరీలో ఉన్న కార్మికులను బయటకు తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం జరిగింది. హత్నూర మండలం చందాపూర్ వద్ద ఉన్న ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు చెలరేగాయి. ఈ అగ్ని ప్రమాదంలో ఎస్బీ పరిశ్రమలో మేనేజర్ గా చేస్తున్న రవి మృతి చెందినట్లు సమాచారం. ఇప్పటివరకూ ఏడుగురు వ్యక్తులు చనిపోగా, మరో 10 మంది వరకు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. మంటలు పక్కనున్న మరో పరిశ్రమకు వ్యాపించాయి. చుట్టుపక్కల వారిని సాధ్యమైనంత త్వరగా అక్కడి నుంచి ఖాళీ చేయిస్తున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన వారిని, మృతదేహాలను సంగారెడ్డిలోని ఆసుపత్రికి తరలిస్తున్నారు. అగ్ని ప్రమాదం సమాచారం అందుకున్న సిబ్బంది ఫైరిరజన్లతో అక్కడికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో 50 మంది కంపెనీలోపల ఉన్నట్లు సమాచారం. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయి అక్కడ భయానక వాతావరణం కనిపిస్తోంది.

## రాజకీయ దుమారం రేపుతున్న పెన్షన్ల పంపిణీ



**చంద్రబాబు తీరువల్లే ఈ దురవస్థ ఏర్పడింది**
**వలంటీర్లపై ఇసికి ఫిర్యాదు చేయడంతోనే సమస్య**
**మండిపడ్డ మాజీమంత్రి పేర్ని నాని**

**అమరావతి:** ఏపీలో ఇంటింటికీ పెన్షన్ పంపిణీ రద్దు అంశం రద్దు రాజకీయ దుమారం రేపుతోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా వాలంటీర్ల ద్వారా పెన్షన్, ఇతర ప్రభుత్వ పథకాల పంపిణీ రద్దు చేయాలంటూ విపక్షాలు చేసిన ఫిర్యాదు మేరకు ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. పెన్షన్ పంపిణీ కోసం ప్రత్యామ్నాయాలు వాడుకోవాలన్న ఈసీ సూచనతో ప్రభుత్వం సచివాలయాల వద్ద పెన్షన్ పంపిణీ ప్రారంభించింది. అయితే, చాలా చోట్ల పెన్షన్ పంపిణీలో జాప్యం అవుతుండటంతో వృద్ధులు వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు మీద మాజీ మంత్రి పేర్ని నాని ఘాటైన విమర్శలు చేశారు. చంద్రబాబుకు పేదల మీద ప్రేమ ఇప్పుడొచ్చిందా అని ప్రశ్నించారు. వృద్దులు, వికలాంగులకు పెన్షన్ అందకుండా అడ్డుకున్న చంద్రబాబు ఇప్పుడు సచివాలయ సిబ్బందిని వాడుకొమ్మని ప్రభుత్వానికి సలహా ఇస్తున్నాడని, ఒకప్పుడు సచివాలయ ఉద్యోగాలు అసలు ప్రభుత్వ ఉద్యోగాలే కాదన్న చంద్రబాబు ఇప్పుడు పెన్షన్ పంపిణీ కోసం వారిని వాడుకొమ్మని ఎలా చెబుతారని ప్రశ్నించారు. వాలంటీర్ వ్యవస్థ నోరు పారేసుకున్న చంద్రబాబు ఇప్పుడు వాలంటీర్ వ్యవస్థను అడ్డుకోవద్దని ఈసీకి లేఖ ఎలా రాస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో ఎన్నికలకు పసుపు కుంకుమ డబ్బులు పంచుతుంటే తాము అడ్డుకోలేదని, జన్మ భూమి కమిటీల ద్వారా టీడీపీ కార్యకర్తలకు డబ్బులు పంచినా కూడా అడ్డుకోలేదని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పెన్షన్లపై దొంగ నాటకాలు ఆడుతున్నారని మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు పేదలపై ప్రేమ ఇప్పుడొచ్చిందా అని మండిపడ్డారు. గతంలో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి ఎగ్గొట్టారని విమర్శించారు.
బాబు ఏనాడు సచివాలయం గుమ్మం తొక్కలేదని దుయ్యబట్టారు. ప్రతి నెల ఒకటో తేదీనే పెన్షన్లు ఇచ్చిన ఘన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని కొనియాడారు. 2019 ఎన్నికల సమయంలో రైతుకు జన్మభూమి కమిటీ ద్వారా డబ్బులు పంచుతున్నా తాము అడ్డుకోలేదన్నారు. జన్మభూమి కమిటీల ద్వారా టీడీపీ కార్యకర్తలకు పంచుకున్నారని ప్రస్తావించారు. పసుపు కుంకుమ పేరుతో డబ్బులు వేసినా ఆపాలని తాము ఈసీకి ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఇప్పుడు ఈసీ దగ్గర పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. తాము ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఇన్నాళ్లు ఆరోపించారని.. ఇప్పుడు లక్షా 60 వేల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారని వాళ్లే చెబుతున్నారని అన్నారు. మరి ఈ సచివాలయ ఉద్యోగులంతా ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్న పాపపు నోళ్లతోనే లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

## రఘురామ కోసం సీటు మార్చే యత్నం


**నర్సాపురం బదులు ఏలూరు ఇచ్చే ప్రతిపాదన**
**యనమల కుటుంబానికి అత్యధిక సీట్లపై పార్టీలో చర్చ**
**అనపర్తి కోసం పట్టుబడుతున్న నల్లమిల్లి**
**బిజెపితో చర్చలు జరుపుతున్న టిడిపి**

**అమరావతి:** నర్సాపురం నుంచి టిడిపి అభ్యర్థిగా ప్రస్తుత ఎంపి రఘురామ కృష్ణంరాజును పోటీ చేయేంచేందుకు టిడిపి మల్లగుల్లాలు పడుతోంది. పొత్తులో భాగంగా ఈ సీటు బిజెపి ఖాతాలో పడింది. ఈ క్రమంలో బీజేపీ తీసుకున్న సీట్లలో కొన్ని మార్పు, చేర్పులు కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గం విషయంలో బీజేపీ, టీడీపీ మధ్య చర్చలు జరుగుతున్నాయి. రఘురామకృష్ణరాజును ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీకి నిలబెట్టాలని ప్రయత్నిస్తున్న టీడీపీ .. బీజేపీ హైకమాండ్ ముందు ఓ ప్రతిపాదన పెట్టినట్లుగా తెలుస్తోంది. ఏలూరు ఎంపీ సీటును తీసుకుని.. నర్సాపురం ఎంపీ సీటును టీడీపీకి ఇచ్చేయాలని అడుగుతున్నారు. ప్రస్తుతం ఈ అంశంపై చర్చలు జరుగుతున్నాయి. ఈ విషయంపై స్పష్టత ఉండబట్టే.. రఘురామకృష్ణరాజు తానుపోటీలో ఉంటానని గట్టి
నమ్మకంతో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఏలూరు నుంచి టీడీపీ పుట్టా మహేష్ యాదవ్‌కు సీటు ఇచ్చింది. ఆయన యనమల అల్లుడు. పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు. ఆయన కడప జిల్లా మైదుకూరు నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. యనమల కుమార్తె తుని నుంచి పోటీ చేస్తోంది. ఇలాంటి సమయంలో మహేష్ యాదవ్‌కు టిక్కెట్ ఇవ్వాల్సినంత అవసరం ఏముందన్న చర్చ ఆ పార్టీలో జరిగింది. ఏలూరులో బీసీకి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.. చివరికి మహేష్ యాదవ్ మాత్రమే కనిపించారు. నిజానికి ఏలూరు సీటు బీజేపీ తీసుకుంటుందన్న చర్చ మొదట్లో నడిచింది. తర్వాత టీడీపీ ఖాతాలోకి వచ్చింది. నర్సాపురం టిక్కెట్ రఘురామకు బీజేపీ కేటాయించి ఉంటే అసలు సమస్య వచ్చేది కాదు. బీజేపీ అంతర్గత రాజకీయాల కారణంగా ఈ సమస్య ఉత్పన్నమయింది. రఘురామకు టిక్కెట్ కేటాయించేలేము అనుకున్నప్పుడు.. వేరే నియోజకవర్గాన్ని బీజేపీ ఆప్షన్ గా తీసుకున్నట్లయితే బాగుండేదన్న అభిప్రాయం ఉంది. రఘురామకు టిక్కెట్ ఇవ్వకపోవడం.. జగన్ కు బలం అన్న పరిస్థితి రావడంతో టీడీపీ ఆయనను నిలబెట్టాలని నిర్ణయించుకుంది. ఈ అంశంపై చర్చలు జరుగుతున్నాయి. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా సీట్ల ఖరారులో ముఖ్య నేతలు సీట్లు కోల్పోయారు. టీడీపీ 144 అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తోంది. ఇప్పటికే సీట్లకు అభ్యర్దులను ఖరారు చేసింది. టీడీపీ నుంచి అనపర్తి సీటు దక్కించుకున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రచారం చేసుకుంటున్న వేళ అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. అనపర్తి సీటు పొత్తులో భాగంగా బీజేపీకి దక్కింది. అక్కడ నుంచి బీజేపీ తమ అభ్యర్దిని ప్రకటించింది. దీంతో, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి తో పాటుగా ఆయన మద్దతు దారులు ఆగ్రహం వ్యక్తం చేసారు. తాను స్వతంత్రంగా పోటీ చేసేందుకు రామకృష్ణారెడ్డి సిద్దమయ్యారు. నియోజకవర్గ పరిధిలో ప్రచారం ప్రారంభించారు. ఆనపర్తిలో బీజేపీ అభ్యర్థి చాలా బలహీనంగా ఉన్నారు. రెండు రోజుల్లో రామకృష్ణారెడ్డికి అనుకూలమైన నిర్ణయం తీసుకుంటానని చెప్పినట్లు సమాచారం. బీజేపీ అనపర్తి సీటు వదులుకోవాలంటే అదే జిల్లాలో మరో స్థానం కోరుతున్నట్లు పార్టీ నేతల్లో చర్చ సాగుతోంది. రాజమండ్రి సిటీ లేదా రూరల్ ఇవ్వాలనేది బీజేపీ నేతల తాజా డిమాండ్‌గా చెబుతున్నారు. దీని పైన చంద్రబాబు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రామకృష్ణారెడ్డికి భవిష్యత్ పైన హామీ ఇస్తార..లేక..సీటు మార్పు చేసి బీజేపీకి మరో స్థానం కేటాయిస్తారా అనేది ఇప్పుడు గోదావరి జిల్లా రాజకీయాల్లో ఆసక్తి కరంగా మారుతోంది. అయితే పట్టుదలకు పోయి ఓడిపోవడం కన్నా.. టీడీపీ నుంచి రామకృష్ణారెడ్డి పోటీ చేయడమే మంచిదన్న వాదన వినిపిస్తోంది. ఆయన బీజేపీ నుంచి పోటీ చేయమన్న ప్రతిపాదన వచ్చినా.. నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అంగీకరించలేదని చెబుతున్నారు. అనకాపల్లి జిల్లా ఎంపీ స్థానం పరిధిలో ఉన్న రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు తథ్యమనే ప్రచారం జరుగుతోంది. ఈ వార్త అనకాపల్లి రాజకీయవర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. అనకాపల్లి ఎంపీ నియోజవర్గ పరిధిలో ఉన్న యలమంచిలి, మాడుగుల స్థానాల్లో అభ్యర్థుల్ని మార్చనున్నట్టుగా ముమ్మర ప్రచారం సాగుతోంది. ఈ మేరకు అధిష్టానం రంగంలోకి దిగిందనే వార్తలు వినిపిస్తున్నాయి. మాడుగుల స్థానాన్ని టీడీపీ నుంచి పైలా ప్రసాద్‌కు కేటాయించారు. అయితే తొలి నుంచీ పైలా ప్రసాద్ అభ్యర్థిత్వంపై స్థానికంగా వ్యతిరేకత వస్తూనే ఉంది. దీంతో అభ్యర్థిని మారుస్తారనే ప్రచారం తొలిరోజు నుంచీ మొదలైంది. తాజాగా బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కూడా ఇదే అభిప్రాయాన్ని టీడీపీ అధిష్టానానికి చేరవేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే మాడుగుల స్థానాన్ని బండారు సత్యనారాయణమూర్తికి కేటాయించాలని కూడా సీఎం రమేష్ సూచించినట్టుగా తెలిసింది. ఈ మేరకు బండారు సత్యనారాయణమూర్తికి ఇప్పటికే అధిష్టానం నుంచి పిలుపు వచ్చినట్లు సమాచారం. మాడుగుల స్థానాన్ని బండారు సత్యనారాయణమూర్తికి కేటాయిస్తే అటు ఎంపీ, ఇటు అసెంబ్లీ స్థానాలకు ప్రయోజనం ఉంటుందని సీఎం రమేష్ యోచిస్తున్నారని సమాచారం. అలాగే ఇప్పటికే అలక మీద ఉన్న బండారు సత్యనారాయణమూర్తికి న్యాయం చేసినట్టు అవుతుందని భావిస్తున్నారు. యలమంచిలి నుంచి జనసేన అభ్యర్థిగా సుందరపు విజయ్‌కుమార్ బరిలో ఉన్నారు. కానీ విజయ్‌కుమార్ ఈ స్థానంలో గట్టిపోటీ ఇవ్వలేకపోతున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ భావిస్తున్నారు. యలమంచిలి సీటు విషయంలో పరిశీలించి తదుపరి నిర్ణయం నిమిత్తం ఏం చేయాలో తేల్చాలని జనసేన నేత కొణతాల రామకృష్ణ, టీడీపీ నేత పీలా గోవింద్ సత్యనారాయణలకు బాధ్యతలు అప్పగించినట్టుగా తెలిసింది.

# ర్యాగింగ్ ఓ రాక్షస క్రీడ...!!!







ఆదిమ మానవుడు నుండి నాగరిక సమాజంలోకి మనిషి అడుగు పెట్టినా కూడా తన బుర్రలో ఎక్కడో దాగి ఉన్న పైశాచిక బుద్ధి అనుకూల పరిస్థితులలో బయటకు వచ్చి బుసలు కొడుతుంది. ఎదుటివారి నిస్సహాయక పరిస్థితే ఇవతలి వాడికి అనుకూల పరిస్థితి. విద్యార్థుల స్థాయిలో కొంతమందిలో ఇది ర్యాగింగ్ రూపంలో బయట పడుతుంది. ర్యాగింగ్ ఓ పైశాచిక క్రీడ. సైకోయిజం. సూక్ష్మంగా చెప్పాలంటే ర్యాగింగ్ అనేది ఎదుటివాడిని ఇబ్బంది పెట్టి దానిని చూసి ఆనందపడే ఒక పాశవిక చర్య. ర్యాగింగ్ అనగా కళాశాలల్లో సీనియర్ విద్యార్థులు కొత్తగా వచ్చిన విద్యార్థులకు మనస్థాపం కలిగించే రీతిలో ప్రవర్తించడం. మన దేశంలోని ఉన్నత విద్యావ్యవస్థలో ర్యాగింగ్ అనేది కలవరపెట్టే వాస్తవం. దీని వలన అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయి. వేలాది మంది తెలివైన విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతున్నాయి. లోతుగా చూస్తే ఇది జూనియర్లపై వివక్షత చూపడమే. ఈ వివక్షత అనేది రంగు, జాతి, మతం, కులం, లింగం, ప్రాంతీయత, పుట్టిన ప్రదేశం, నివాస స్థలం, ఆర్థిక నేపథ్యం వంటి అనేక రూపాలలో ఉంటుంది. జూనియర్ శారీరకంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని విధాలుగా అధిక స్థాయిలో ఉంటే ర్యాగింగ్ చేయడానికి భయపడతారు. ఏతా వాతా తెలివితేటలు ఉన్నా కూడా బలహీనులే బలవుతున్నారు. ఒక్కోసారి ఈ వేదనను భరించలేక తగు సమయంలో పరిష్కరించే వారు లేక ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. ఈ ర్యాగింగ్లో లైంగిక వేధింపులు, స్వలింగ సంపర్క దాడులు, బట్టలు విప్పడం, బలవంతంగా అశ్లీల చర్యలు, సంజ్ఞలు, శారీరక హాని లేదా ఆరోగ్యానికి లేదా వ్యక్తికి ఏదైనా ఇతర ప్రమాదం కలిగించే చర్యలు ఉంటాయి. సీనియర్లు వారి యొక్క నోట్సులు రాయుంచుట, అకాడమిక్ టాస్కులును జూనియర్లతో చేయిస్తున్నారు. ఈ ర్యాగింగుకు ఓ రిషితీశ్వరి, ప్రీతి లాంటి వారు ఎంతో మంది బలయ్యారు. ఇండియాలో తొలి ర్యాగింగ్ మరణం తమిళనాడులో జరిగింది. చిదంబరంలోని అన్నామలై యూనివర్శిటీలోని రాజా ముత్తయ్య మెడికల్ కాలేజీ విద్యార్థి పొన్ నవరసు 6 నవంబర్ 1996న హత్య చేయబడ్డాడు. అదే కళాశాలలో సీనియర్ విద్యార్థి జాన్ డేవిడ్ నవరసుకు ర్యాగింగ్ చేస్తుండగా అతనిపై దాడి చేసినట్లు నిరూపితం అయింది. హత్య యొక్క భయంకరమైన స్వభావం ప్రజల ఆగ్రహానికి కారణమైంది. తమిళనాడు ప్రభుత్వం ర్యాగింగ్‌ను నేరంగా పేర్కొంటూ ర్యాగింగ్ నిరోధక ఆర్డినెన్స్‌ను ఆమోదించింది. తరువాత ఈ ఆర్డినెన్స్ తమిళనాడు ర్యాగింగ్ నిషేధ చట్టం, 1997గా అధికారికంగా రూపొందించబడింది. తద్వారా విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను నిషేధించి చట్టాన్ని నేరంగా పరిగణించిన భారతదేశంలో తమిళనాడు మొదటి రాష్ట్రంగా మారింది.

**ర్యాగింగ్ పై కమిటీలు ఏమీ చెప్పాయి:**

ఏకే గంగూలీ నేతృత్వంలోని ధర్మాసనం “అందరూ ఒకే విధమైన మనస్తత్వంతో ఉండరు. కొందరు అత్యంత సున్నిత మనస్కులై చిన్నపాటి విషయాలకే ఉద్రేకానికి గురవుతుంటారు” అని పేర్కొంది. 1999లో విశ్వ జాగృతి విషయంలో సుప్రీం కోర్టు ర్యాగింగ్‌ను “మాట్లాడిన లేదా వ్రాసిన మాటల ద్వారా లేదా ఇతర విద్యార్థిని ఆటపట్టించడం లేదా అసభ్యంగా ప్రవర్తించడం, రౌడీ లేదా క్రమశిక్షణా రాహిత్యం వంటి ప్రభావంతో కూడిన ఏదైనా క్రమరహిత ప్రవర్తన. ఒక ఫ్రెషర్ లేదా జూనియర్ విద్యార్థిలో చికాకు, కష్టాలు లేదా మానసిక హాని కలిగించే లేదా భయం లేదా భయాన్ని పెంచే కార్యకలాపాలు లేదా విద్యార్థి సాధారణ కోర్సులో చేయని ఏదైనా చర్య లేదా ఏదైనా చేయమని విద్యార్థులను అడగడం మరియు ఒక ఫ్రెషర్ లేదా జూనియర్ విద్యార్థి యొక్క శరీరాకృతి లేదా మానసిక స్థితిని ప్రతికూలంగా ప్రభావితం చేసే విధంగా అవమానం లేదా ఇబ్బందిని కలిగించే లేదా సృష్టించే ప్రభావాన్ని కలిగించడం అని నిర్వచించింది. డెబ్భైవ దశకం చివరిలో ఒక ప్రాంతీయ ఇంజినీరింగ్ కళాశాలలో ఇద్దరు ఫ్రెషర్లు మరణించిన తరువాత భారత ప్రభుత్వం దేశంలో ర్యాగింగ్‌ను నిషేధిస్తూ మొదటిసారి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ర్యాగింగ్‌ను అరికట్టేందుకు విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకాలను జారీ చేయాలని విశ్వ జాగృతి మిషన్ దాఖలు చేసిన పిల్‌పై గౌరవనీయులైన సుప్రీంకోర్టు 1999లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ని కోరడంతో న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేపీఎస్ ఉన్ని ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై పరిశీలించి నివేదిక సమర్పించేందుకు యూజీసీ నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. ఉన్నీ కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ర్యాగింగ్‌పై చట్టాలు తీసుకురావాలని సూచించింది. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా సున్నితత్వం కోసం చేపట్టాల్సిన పలు చర్యలను కమిటీ సిఫార్సు చేసింది. విద్యార్థులను ర్యాగింగ్ వ్యతిరేక కార్యకలాపాలకు ప్రోత్సహించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. ర్యాగింగ్‌ను అరికట్టడంలో విఫలమైన సంస్థలను అడ్మిషన్లకు దూరంగా ఉంచాలని కూడా సూచించింది.%స్త్ర% విద్యార్థుల అడ్మిషన్ రద్దు నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించే వరకు శిక్షలు విధించాలని ఈ కమిటీ సూచించింది. తీవ్రతను బట్టి మూడు సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష విధించ వచ్చని తెలిపింది. 2006 లో గౌరవ సుప్రీంకోర్టు ర్యాగింగ్‌ను నిరోధించడానికి మార్గాలు మరియు పద్ధతులను సూచించడానికి సి.బి.ఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్ కె రాఘవన్ ఆధ్వర్యంలో మరొక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ పలు కీలక పరిశీలనలు చేసింది. ర్యాగింగ్‌కు మానసిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక మరియు సాంస్కృతిక సహా అనేక అంశాలు కారణాలుగా ఉన్నాయని, ఇది ఉన్నత విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది. పాఠశాల దశ నుంచే మానవీయ విలువలను పెంపొందించడంలో మన వైఫల్యం ర్యాగింగ్‌గా పరిగణించబడుతుంది అని చెప్పింది. ర్యాగింగ్ జరిగినట్లయితే యాజమాన్యం, ప్రిన్సిపల్ బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. ర్యాగింగ్‌ను అరికట్టేందుకు కమిటీ%ఊ% కొన్ని బలమైన సిఫార్సులు చేసింది. క్యాంపస్‌లలో ర్యాగింగ్ కేసుల పెరుగుదల సమస్యను పరిష్కరించడానికి, యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ (యు.జి.సి) ఉన్నత విద్యా సంస్థలలో ర్యాగింగ్ ముప్పును అరికట్టడంపై నిబంధనలు 2009 పేరున తీసుకువచ్చింది. దీని ప్రకారం ర్యాగింగ్ కి పాల్పడిన వారికి సస్పెన్షన్లు విధించవచ్చని, స్కాలర్‌షిప్ , ఫెలోషిప్లు నిలిపివేయొచ్చు. పరీక్షలకు హాజరుకాకుండా డీబార్ , పరీక్షల ఫలితాలు నిలుపుదల , హాస్టల్ నుండి బహిష్కరణ, అడ్మిషన్లు రద్దు వంటివి చేయొచ్చు. ఇంకా ఏదైనా ఇతర సంస్థలో ప్రవేశం నుండి డిబార్ చేయొచ్చని తెలిపింది. వీటిని ఉన్నత విద్యా సంస్థలు తప్పని సరిగా పాటించాలని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1997లో ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిషేద చట్టాన్ని ప్రవేశపెట్టింది. ర్యాగింగ్ అనేది కళాశాలలే కాకుండా విద్యను బోధించే ఏ సంస్థ అయనా, అనాధశరణాలయం, విద్యార్థి వసతిగృహం, ట్యుటోరియల్ కాలేజీ వంటి విభాగాలన్నీ ఇదే కోవలోకి వస్తాయని. ఇవీ కాక ఈ సంస్థల వెలుపల కూడా అనగా రోడ్లు, బస్సులు ఆగే ప్రాంతం, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, వైద్యశాల వంటి ప్రదేశాలన్నింటిలోనూ ర్యాగింగ్ జరపటం నేరం. ఒక విద్యార్థికి ర్యాగింగ్ ద్వారా అవమానం చేసి అతన్ని బాధించడం జరిగితే 6 నెలల వరకు జైలు శిక్ష 1000 రూపాయల వరకు జరిమానా విధింపబడుతుంది. ర్యాగింగ్ సందర్భంలో మరణించటం జరిగిన లేదా ఆ విద్యార్థి ఆత్మహత్యకు లోనైనా నేరస్తునికి జీవిత ఖైదు లేదా 10 సంవత్సరాల వరకు జైలుశిక్ష మరియు 50,000 రూపాయలవరకు జరిమానా విధింపబడతాయి. యు.జి.సి ర్యాగింగ్ బాధితులకు సహాయం చేయడానికి 12 భాషలలో 1800–180–5522 యాంటీ ర్యాగింగ్ టోల్-ఫ్రీ “హెల్ప్‌లైన్”ని ఏర్పాటు చేసింది. ఇంకా యాంటీ ర్యాగింగ్ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసింది. ఇందులో ఫిర్యాదులు చేయొచ్చు. పరిష్కార స్థితిని రియల్ టైంలో తెలుసుకోవచ్చు.

**పరిష్కారాలు :**

ర్యాగింగ్ నిరోధానికి కళాశాలలు, ప్రత్యేక బాధ్యత వహించాలి. కళాశాలలో చేరే సమయంలో అండర్ టేకింగ్ తీసుకోవాలి. సీనియర్‌లు, జూనియర్‌లు కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వారికి విడివిడిగా హాస్టల్ వసతి కల్పించాలి. ర్యాగింగ్ ఎంత పెద్ద నేరమో అవగాహన కలిగించాలి. విద్యాలయాలలో ఏర్పాటు చేసిన కౌన్సిలింగ్ కేంద్రాలు, యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏవిధమైన ఒత్తిడికి గురికాకుండా చురుకుగా పనిచేసి సత్వర నిర్ణయాలు తీసుకోవాలి. ముఖ్యమైన ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఉంచాలి. కొన్ని సినిమాలు, వెబ్ సీరియళ్లను నిషేధించాలి. యువత విచ్చలివిడితనాన్ని విడిచిపెట్టాలి. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలకు ర్యాగింగ్ ఎంత నేరమో తెలియజేయాలి. దోషులకు కఠిన శిక్షలు వేయాలి. వీరి పేర్లు, వారికి పడ్డ శిక్షలు ప్రతీ కాలేజీ నోటీసు బోర్డులో ఉండేటట్లు చూడాలి. ర్యాగింగ్ గురించి ఉన్నత పాఠశాల స్థాయిలో పాఠాలుగా చేర్చాలి. ర్యాగింగ్‌ను అరికట్టాల్సిన ప్రాథమిక బాధ్యత విద్యా సంస్థలపైనే ఉంటుంది. వాటిని నియంత్రించడంలో మీడియా , పౌర సమాజం చురుకుగా పాల్గొనవలసిన అవసరం ఉంది.

**జనక మోహన రావు దుంగ**
**అధ్యాపకుడు**
**శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్**

# మండే ఎండలకు మనిషే కారకుడు

గత రెండు రోజులుగా మన రెండు తెలుగు రాష్ట్రాలలో ఎండలు తీవ్రంగానే ఉన్నాయి. ఇలా ఉండ బోతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తూనే ఉంది.

దీనంతటికీ కారణం వాతావరణములో వస్తున్న మార్పులే. మానవ, సహజ కారకాలు రెండూ భూమి వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి. అయినా భూతాపం పెరగడానికి అధిక కారకుడు మాత్రం మనిషే..! భూమి వేడెక్కడాన్ని భూతాపం లేదా గ్లోబల్ వార్మింగ్ అంటారు. దీనికి కారణం వాతావరణంలో పెరుగుతున్న గ్రీన్హౌస్ వాయువులే ! వాతావరణంలో వేడిని బంధించే వాయువులను గ్రీన్‌హౌస్ వాయువులు అంటారు. పగటిపూట సూర్యుడు భూమి యొక్క వాతావరణాన్ని వేడి చేస్తాడు. రాత్రి సమయంలో భూమి చల్లబడినప్పుడు వేడి తిరిగి వాతావరణంలోకి ప్రసరిస్తుంది. ఈ ప్రక్రియలో భూవాతావరణంలోని గ్రీన్హౌస్ వాయువుల ద్వారా వేడిని గ్రహించబడుతుంది. ఇది భూమి యొక్క ఉపరితలం వేడెక్కేలా చేస్తుంది. సూర్యుని నుండి ఉష్ణశక్తి భూమికి చేరినప్పుడు భూమి ఈ శక్తిలో కొంత భాగాన్ని గ్రహిస్తుంది. మిగిలిన భాగాన్ని వేడిగా అంతరిక్షంలోకి ప్రసరిస్తుంది. భూమి యొక్క ఉపరితల ఉష్ణోగ్రత ఇన్కమింగ్, అవుట్గోయింగ్ శక్తి మధ్య ఈ సమతుల్యతపై ఆధారపడి ఉంటుంది. శక్తి సమతుల్యతలో మార్పు ఫలితమే భూమి యొక్క సగటు ఉష్ణోగ్రత వెచ్చగా లేదా చల్లదనాన్ని నిర్ణయిస్తుంది. ఇది దిగువ వాతావరణంలో భూమిపైన, మహాసముద్రాలలో అనేక ఇతర మార్పులకు దారితీస్తుంది.

**గ్రీన్హౌస్ లేదా హరిత వాయువులు :**

కార్బన్డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, ఫ్లోరినేటెడ్లను గ్రీన్హౌస్ వాయువులనంటారు.

మానవ కార్యకలాపాల కారణంగా పారిశ్రామిక విప్లవం నుండి కీలకమైన గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రతలు పెరిగాయి. కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ సాంద్రతలు గత యెనిమిది లక్షల సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా ఇప్పుడు భూమి యొక్క వాతావరణంలో అధికంగా ఉన్నాయి. పారిశ్రామిక పూర్వ కాలంలో ఉష్ణోగ్రతతో పోలిస్తే రెండు డిగ్రీల సెల్సియస్ పెరుగుదల సహజ పర్యావరణం మానవ ఆరోగ్య శ్రేయస్సుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలను చూపడంతోపాటు వాతావరణంలో ప్రమాదకరమైన మార్పులు సంభవించే ప్రమాదం ఉంది. ఈ కారణాన ఉష్ణోగ్రత పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్కు పరిమితం చేయాలని అంతర్జాతీయంగా నిర్ణయించడం జరిగింది. మానవ ప్రేరిత భూతాపం ప్రస్తుతం దశాబ్దానికి 0.2 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరుగుతోంది. సంవత్సరానికి సుమారు 30 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను వాతావరణంలోకి విడుదలవుతుంది. పారిశ్రామిక పూర్వ కాలం నుండి ప్రస్తుతానికి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ , మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వాయువుల సాంద్రతలు వరుసగా 48శాతం, 250 శాతం, 20 శాతం ఎక్కువగా ఉన్నాయి.



18 వ శతాబ్దం నుండి దాదాపు 280 పార్ట్స్ పర్ మిలియన్ (పి.పి.యం) నుండి 414 పి.పి.యంకి, 722 పార్ట్స్ పర్ బిలియన్ ( పి.పి.బి ) నుండి 1867 పి.పి.బికి, 270 పి.పి.బి నుండి 332 పి.పి.బి కి పెరిగాయి.

**పెరగడానికి కారణాలు:**

బొగ్గు, చమురు, శిలాజ ఇంధనాలను కాల్చడం వలన కార్బన్డయాక్సైడ్ , నైట్రస్ఆక్సైడ్లు, ఆవులు గొర్రెలు తమ ఆహారాన్ని జీర్ణం చేసేటప్పుడు మీథేన్, నైట్రోజన్ ఎరువులు నైట్రస్ఆక్సైడ్లును, ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లు నుండి క్లోరో ఫ్లోరో కార్బన్లు, ఫోమింగ్ యేజెంట్లు, మంటలు ఆర్పే యంత్రాలు, ద్రావకాలు, పురుగుమందులు , ప్రోపోలెంటలు నుండి క్లోరోఫ్లోరో కార్బన్‌లు, హైడ్రోక్లోరోఫ్లోరోకార్బన్‌లు, హైడ్రోఫ్లోరోకార్బన్‌లు, పెర్ఫ్లోరోకార్బన్‌లు, సల్ఫర్ హెక్సాఫ్లోరైడ్‌లు వంటి ఎఫ్ – గ్యాస్లు వెలువడుతున్నాయి. అటవీ నిర్మూలన, వాహనాల అధిక వినియోగం, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ కార్యకలాపాలు గ్లోబల్ వార్మింగ్కు కారణాలు. సూర్యుని హానికరమైన రేడియేషన్ల నుండి భూమి యొక్క ఉపరితలాన్ని రక్షించడానికి ఓజోన్ పొర బాధ్యత వహిస్తుంది. కానీ ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్‌ల నుండి విడుదలయ్యే క్లోరోఫ్లోరోకార్బన్లు ఓజోన్ పొర క్షీణతకు దోహదం చేయడం వలన సూర్యుని నుండి వచ్చే అతినీలలోహిత కిరణాలు భూమిని చేరి తద్వారా భూమి యొక్క ఉష్ణోగ్రత పెరుగుతుంది. వాతావరణంలోని ఏరోసోల్స్ వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి. ఏరోసోల్‌లు చాలా చిన్నవిగా ఉండే సూక్ష్మ (ఘన లేదా ద్రవ) కణాలు, పెద్ద కణాల వలె త్వరగా ఉపరితలంపై పడకుండా, అవి రోజుల నుండి వారాల వరకు గాలిలో నిలిపివేయబడతాయి. శిలాజ ఇంధనాలు జీవపదార్థాలను కాల్చడం వంటి మానవ కార్యకలాపాలు ఈ పదార్థాల ఉద్గారాలకు దోహదం చేస్తాయి. గ్రీన్‌హౌస్ వాయువుల వలె కాకుండా ఏరోసోల్‌ల వాతావరణ ప్రభావాలు అవి దేనితో తయారు చేయబడ్డాయి, అవి ఎక్కడ విడుదలవుతాయి అనే దానిపై ఆధారపడి ఉంటాయి. వాటి రంగు ఇతర కారకాలపై ఆధారపడి ఏరోసోల్స్ సూర్యరశ్మిని గ్రహించవచ్చు లేదా ప్రతిబింబిస్తాయి. సూర్యరశ్మిని ప్రతిబింబించే ఏరోసోల్‌లు, అగ్నిపర్వత విస్ఫోటనాల నుండి కణాలు లేదా బొగ్గును కాల్చడం నుండి వెలువడే సల్ఫర్ ఉద్గారాలు వంటివి శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. నలుపు కార్బన్ (మసిలో ఒక భాగం) వంటి సూర్యరశ్మిని గ్రహించేవి వార్మింగ్ ప్రభావాన్ని కలిగి ఉంటాయి..క్లైమేట్ చేంజ్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ ( అనేది జాతీయ అంతర్జాతీయ వాతావరణ రాజకీయాలలో పారదర్శకతను ప్రారంభించడానికి ఒక సాధనం. ఇటీవల విడుదల చేసిన క్లైమేట్ చేంజ్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ ( సి.సి.పి. ఐ ) 2024లో మనదేశం 7 వ స్థానంలో ఉంది. గత యేడాది 8వ స్థానంలో ఉండేది. డెన్మార్క్, ఎస్టోనియా, ఫిలిప్పీన్స్ దేశాలు వరుసగా 4వ, 5వ, 6వ స్థానాలలో నిలిచాయి. మొదటి మూడు స్థానాలు ఏ దేశానికీ కేటాయించ లేదు. సి.సి.పి. ఐ యూరోపియన్ యూనియన్తో కలిపి 64 దేశాలకు ర్యాంకింగ్ ఇస్తుంది.

**పరిష్కారాలు :**

పారిస్ ఒప్పందంలో నిర్ణయించిన విధంగా మనం గ్లోబల్ వార్మింగ్‌ను 1.5ళీ%జ%కి పరిమితం చేయాలి. శిలాజ ఇందనాలతో నడిచే వాహనాల స్థానంలో బ్యాటరీ వాహనాలను వాడాలి. ఇందుకు ప్రజలను ప్రోత్సహించాలి. సోలార్, గాలి మరలనుపయోగించి విద్యుత్తును తయారు చేసుకోవాలి. గ్రీన్హౌస్ వాయువులను విడుదల చేసే పరిశ్రమలను మూసివేయాలి. వ్యవసాయ రంగంలో రసాయన ఎరువులు బదులుగా బయో ఫెర్టిలైజార్స్ వాడాలి. వాయు కాలుష్యాన్ని, జల కాలుష్యం కారకాలను గుర్తించి వాటిని అపే ప్రయత్నాలు కొనసాగించాలి. కార్బన్ పన్నులను పెంచాలి. ఎక్కువ సంఖ్యలో మొక్కలను నాటాలి. ప్లాస్టిక్లలకు ప్రత్యామ్నాయాలు వెతకాలి. అవసరం మేరకే ఇంట్లో విద్యుత్తును వాడాలి. అధికంగా ఎ.సిలు వాడకూడదు.

వ్యక్తిగత వాహనాలకు బదులుగా పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ను వినియోగించాలి. అత్యవసరం అయితేనే విమానాల్లో ప్రయాణించాలి. ప్రజలందరికీ గ్లోబల్ వార్మింగ్ గురించి చైతన్య పరచాలి. ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా భూతాపాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలి.

**జనక మోహన రావు దుంగ**
**శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్**



# పార్క్ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

**- కమీషనర్ ను కలసిన సాయి ప్రియా కాలనీ వాసులు**

**మేడిపల్లి- రాజముద్ర న్యూస్:**

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని పార్క్ స్థలాలను కాపాడి ప్రజా అవసరాలకు వినియోగించాలని 3వ డివిజన్ సాయిప్రియా కాలనీ వాసులు పీర్జాదిగూడ కమీషనర్ త్రిలేశ్వర్ రావు ను కలసి వినతిపత్రం అందించారు. ఈ మేరకు మంగళవారం నాడు సాయిప్రియా కాలనీ పెద్దమ్మ తల్లి, గణేష్ ఉత్సవ సమితి కమిటీ అధ్వర్యంలో పార్క్ స్థలానికి సంబంధించిన పత్రాలను కమీషనర్ కు అందించి గతంలో ఇంటి నిర్మాణపు అనుమతులను రద్దు చేసిన విషయాన్ని గుర్తుకు చేశారు.ఈ మేరకు కాలనీ అధ్యక్షుడు అకుల కమలాకర్ మాట్లాడుతూ... సాయిప్రియా నగర్ రోడ్డు నెంబరు రెండులో రెండు వేల గజాలు, రోడ్ నెంబర్ మూడులో సుమారు 11వందల గజాల స్థలాన్ని ప్రజా వినియోగం కోసం పార్క్ స్థలంగా లే అవుట్ లో చూపించారని కానీ కొందరు కబ్జా దారులు పార్క్ స్థలానికి బై నెంబర్లను వేసి వేరే వారికి విక్రయించడం జరిగిందని అన్నారు. కొట్ల రూపాయలు విలువ చేసే ఈ పార్క్ స్థలాన్ని కాపాడి ప్రజా అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమీషనర్ ను కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర రియాల్టర్ అధ్యక్షుడు ప్రవీణ్ నారగోని కాలని వాసులు ఉన్నారు.

# 9నుంచి ఇంద్రకీలాద్రిపై ఉగాది ఉత్సవాలు

**విజయవాడ:** ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ దేవాలయంలో ఈనెల 9 నుంచి క్రోధి నామ సంవత్సర ఉగాది మహోత్సవాలు ప్రారంభంకానున్నట్లు దుర్గగుడి ఈవో రామారావు వెల్లడించారు. బుధవారం చైత్ర మాస బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఈవో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈనెల 9వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు ప్రత్యేక పుష్పార్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉగాది రోజున మధ్యాహ్నం 3 గంటలకు పంచగ శ్రవణం జరుగుతుందన్నారు. తంగిరాల ప్రభాకర్ సిద్దాంతి పంచగా శ్రవణాన్ని పఠిస్తారని అన్నారు. సాయంత్రం 6 గంటలకు వెండి రథం నగర ఉత్సవానికి వెళ్తుందన్నారు. ఉగాది రోజు ఆర్జిత సేవలు కొన్ని నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఉగాది రోజున ఉదయం 8 గంటల నుంచి దుర్గమ్మ దర్శనాలు ప్రారంభం అవుతాయన్నారు.

రాజముద్ర
తెలుగు దినపత్రిక



# ప్రభాస్ హీరోయిన్ స్కిన్ షోకి మతి పోతుంది



మహేష్ బాబు, సుకుమార్ కాంబోలో వచ్చిన '1 నేనొక్కడినే' సినిమాతో సినిమా ఇండస్ట్రీకి పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి సనన్. ఈ అమ్మడు తెలుగు లో మొదటి సినిమాతో కమర్షియల్ గా భారీ విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. అయితే ప్రేక్షకులకు నోటెడ్ అయ్యింది.తెలుగు లో ఆఫర్ల కోసం చూడకుండానే బాలీవుడ్ నుంచి ఈ అమ్మడికి పిలుపు వచ్చింది. హీరో పంతీ సినిమా తో హిందీ సినిమా ల్లో అడుగుపెట్టిన ఈ అమ్మడు వెనక్కి తిరిగి చూసుకోకుండా దూసుకు పోతుంది. ప్రభాస్ తో ఈమె ఆదిపురుష్ లో నటించింది. సీత పాత్రకు భలే సెట్ అయ్యిందని విమర్శకులు సైతం ప్రశంసలు కురిపించారు.సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత చేస్తూ పిచెక్కిస్తున్న ముద్దుగుమ్మ కృతి సనన్ మరోసారి ఈ చెక్స్ డ్రెస్ లో థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ అందాల ఆరబోత చేసింది. ఈ మధ్య కాలంలో రెగ్యులర్ గా తన అందాల ఫోటో షూట్స్ తో వైరల్ అవుతున్న ఈ అమ్మడు ముందు ముందు మరిన్ని సౌత్ సినిమాలు చేయాలని ఇక్కడి వారు కోరుకుంటున్నారు.బాలీవుడ్ లో ఒక వైపు లేడీ ఓరింటెడ్ సినిమాలు చేస్తూ మరో వైపు రెగ్యులర్ కమర్షియల్ సినిమాలను చేస్తున్న ఈ అమ్మడు ఇలాంటి ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తే కచ్చితంగా మరింత బిజీ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# రకుల్ లో ఇంకా ఆ మెరుపు తగ్గలేదు



కెరటం సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ గా మంచి గుర్తింపు దక్కించుకుంది. అయితే రకుల్ స్టార్ హీరోయిన్ గా ఎక్కువ కాలం కొనసాగడంలో విఫలం అయ్యింది. ఆమె సినిమాల ఎంపిక కారణంగా ఈ పరిస్థితి అనేది కొందరి అభిప్రాయం.ఆ విషయం పక్కన పెడితే రకుల్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి 15 ఏళ్లు కావస్తున్నా.. ఆమె వయసు పెరుగుతున్నా కూడా అందం మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. పై పెచ్చు ఆమె ఇంకాస్త అందంగా కనిపిస్తుంది అంటూ నెటిజన్లు ఇలాంటి ఫోటోలు మరియు వీడియోలు చూసిన సమయంలో కామెంట్స్ చేస్తున్నారు.నెట్టింట రకుల్ ప్రీత్ సింగ్ జోరు మామూలుగా లేదు. రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. ఈసారి కూడా రకుల్ అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు మెరిసే ఔట్ ఫిట్ వల్ల రకుల్ మరింత అందంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది.ఆమె చూపులో మెరుపు ఏమాత్రం తగ్గలేదు అంటూ ఈ ఫోటోలు చూసిన నెటిజన్స్ తెగ కామెంట్స్ చేస్తూ ఆమె అందంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం కాస్త డల్ గా ఉన్న రకుల్ ప్రీత్ సింగ్ కచ్చితంగా రాబోయే రోజుల్లో బిజీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి అంటూ ఆమె సన్నిహితులు మరియు ఫ్యాన్స్ మాట్లాడుకుంటూ ఉన్నారు.



# అనసూయ లిప్ స్టిక్ బాలేదా?



యాంకర్ గా బుల్లితెరపై ఒక ట్రెండ్ సెట్ చేసిన వారిలో అనసూయ భరద్వాజ్ నెంబర్ వన్ స్థానంలో ఉంటారు అని చెప్పవచ్చు. తెలుగులో అప్పటివరకు యాంకర్ అనగానే కేవలం మాటలతోనే ఆకట్టుకుంటారు అనే అర్థానికి ఆమె తన గ్లామర్ తో సరికొత్త ట్రెండ్ తీసుకొచ్చారు. చాలా కాలం పాటు పోటీ లేకుండా కొనసాగిన అనసూయ ఇప్పుడు వెండితెరపై కూడా అదే తరహాలో తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకుంటున్నారు.రెగ్యులర్ కమర్షియల్ సినిమాలు మాత్రమే కాకుండా డిఫరెంట్ కంటెంట్ ఉన్న స్పెషల్ క్యారెక్టర్లలో కూడా కనిపిస్తోంది. అలాగే పాజిటివ్ రోల్స్ అనే మాత్రమే కాకుండా నెగటివ్ రోల్స్ వస్తే కూడా చాలా చక్కగా నటిస్తూ విమర్శకుల ప్రశంసలను అందుకుంటున్నారు. పుష్ప సినిమాలో ఆమె చేసిన క్యారెక్టర్ కు ఏ స్థాయిలో గుర్తింపు దక్కిందో ప్రత్యేకంగా చెప్పునవసరం లేదు.అంతకు ముందు రంగస్థలంలో కూడా రంగమ్మత్తగా కనిపించి తన స్థాయిని పెంచుకుంది. అనసూయ 2003 లోనే నాగ అనే సినిమాలో ఒక క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా కనిపించింది. అయితే ఆ తర్వాత కొన్న కాలం పాటు ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగం చేసిన ఆమె అనంతరం జబర్దస్త్ షో ద్వారా సరికొత్తగా తన కెరియర్ స్టార్ట్ చేసింది. ఇక అనసూయ ఇప్పటివరకు 30కి పైగా సినిమాలలో నటించింది.అనసూయ భరద్వాజ్ ఎలాంటి పాత్ర చేసిన కూడా అందులో కంటెంట్ బలంగా ఉంటుంది అని ఒక మంచి నమ్మకం ఏర్పరచుకుంది. కొన్ని లేడీ ఓరియంటెడ్ సినిమాలు కూడా చేసిన అనసూయ పలు వెబ్ సిరీస్ లలో కూడా కనిపించింది. సోషల్ మీడియాలో ఆమెకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎలాంటి గ్లామరస్ ఫోటోలు పోస్ట్ చేసినా కూడా నిమిషాల్లోనే వైరల్ అవుతూ ఉంటాయి.ఇక అనసూయ భరద్వాజ్ రీసెంట్ గా పోస్ట్ చేసిన కొన్ని గ్లామరస్ ఫోటోలు సోషల్ మీడియాలో మరింతగా వైరల్ అవుతున్నాయి. గతంలో ఆమె ఇంతకంటే ఘాటైన డ్రెస్సులాలో కనిపించినప్పటికీ ఈ లుక్కులో మాత్రం మరింత అందంగా ఉంది అంటూ మరికొందరు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ఆమె తన స్టిల్స్ తో కంటే తన చూపులతోనే ఎక్కువ గ్లామర్ ను హైలైట్ చేస్తుంది అని అంటున్నారు.అంతేకాకుండా తన నవ్వుతూనే కుర్రాళ్ళు మనసుల్ని దోచుకుంటుంది అనే కామెంట్స్ వస్తున్నాయి. ఇక ఆమె గ్లామర్ కు చాలా వరకు పాజిటివ్ కామెంట్స్ వస్తున్నాప్పటికీ ఓ వర్గం వారు మాత్రం ఆమె లిప్ స్టిక్ అంతగా బాగోలేదు అని రియాక్ట్ అవుతున్నారు.

# ఆమె మాట నాకు వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది.. : చిరంజీవి



మహానటి సావిత్రి సినీ ప్రస్థానంపై సంజయ్ కిషోర్ రచించిన పుస్తకం 'సావిత్రి క్లాసిక్స్' అగ్ర కథానాయకుడు చిరంజీవి మంగళవారం సాయంత్రం దీనిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమెతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు."సావిత్రమ్మ గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. ఆమెతో మంచి అనుబంధం ఉన్నందుకు గర్వపడుతున్నాను. 'పునాదిరాళ్లు'లో నాకు అవకాశం కాకతాళీయంగా వచ్చింది. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సు పూర్తి కాకుండానే నటించా. ఆ సినిమా కోసం రాజమండ్రి వెళ్తున్నప్పుడు.. నువ్వు సావిత్రమ్మ సినిమాలో నటిస్తున్నావని చెప్పడంతో సంతోషపడ్డాను. చిత్రీకరణకు ముందు ఆమెను చూశాను. ఓసారి నేను డ్యాన్స్ చేస్తూ కిందపడ్డా. అయినా సరే ఆపలేదు. అది చూసిన ఆమె.. 'భవిష్యత్తులో మంచి నటుడివి అవుతావు' అని మెచ్చుకున్నారు. ఆ మాట నాకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చింది. కొన్నేళ్ల తర్వాత 'ప్రేమ తరంగాలు' కోసం పనిచేశాం. ఆమె నాకు తల్లిగా నటించారు. ఆ తర్వాత ఆమెతో నటించే అవకాశం రాలేదు. కళ్లతోనే హావభావాలు పలికించే గొప్ప నటి. ప్రపంచంలో ఆమెలా మరెవ్వరూ చేయలేరు. మా నాన్న అభిమాన నటి. అనుక్షణం ఆమెను ఆరాధిస్తుంటా" అని చిరంజీవి అన్నారు.అనంతరం సావిత్రి కుమార్తె చాముండేశ్వరి మాట్లాడుతూ.. "చిరంజీవి నాకు అన్నలాంటి వ్యక్తి. అమ్మకు ఒక పెద్ద కొడుకు ఉంటే ఏం చేస్తారో ఈరోజు ఆయన అదే చేశారు. పుస్తకావిష్కరణ నిమిత్తం కొన్ని రోజుల క్రితం ఇంటికి వెళ్లి ఆయన్ని కలిశా. ఆయన ఇంట్లోనే పుస్తకం విడుదల చేద్దామని చెప్పా. కానీ, ఆయన మాత్రం ఫంక్షన్ చేయాలని ప్లాన్ చేశారు. ఇంతమంది సమక్షంలో దీనిని విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది" అని చెప్పారు. ఇదే కార్యక్రమంలో చిరంజీవి సతీమణి సురేఖ పాల్గొన్నారు. సురేఖ అడిగిన పలు ప్రశ్నలకు చాముండేశ్వరి సమాధానమిచ్చారు.

# ఆడపులితో స్టార్ హీరోయిన్ కనెక్షన్

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ ఇటీవల స్వస్థలం ముంబైలో ఎక్కువగా కనిపిస్తున్నారు. తిరిగి హిందీ చిత్రసీమలో అవకాశాల కోసం ప్రయత్నిస్తోందని కథనాలొచ్చాయి. ఇంతలోనే ఇప్పుడు తన కొత్త ప్రాజెక్ట్ %--%టైగర్% విడుదల తేదీని ప్రకటించింది. అయితే ఈ సినిమాలో పీసీ నటించలేదు. ఈ అద్భుతమైన సినిమాలో ఒక పాత్రకు తన వాయిస్‌ని అందించానని తెలిపింది. ఈ చిత్రం ద్వారా అడవిని అన్వేషించడం ఎలా సరదాగా ఉందో కూడా వెల్లడించింది.నిజానికి టైగర్ చిత్రం ఎనిమిదేళ్లుగా రూపొందుతోంది. ప్రఖ్యాత డిస్నీ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. అడవిలో స్వేచ్ఛగా తిరిగే పులి కథతో రూపొందించిన చిత్రమిది. అడవి అందాలను తెరపై ఆవిష్కరిస్తుంది. ప్రేమ, సంఘర్షణ, ఆకలి, మనుగడకు సంబందించిన మరెన్నో కథలను టైగర్‌లో చూడొచ్చు.ఈ చిత్రం గురించి మరిన్ని వివరాలను పీసీ తాజాగా వెల్లడించింది. పెద్ద- చిన్న, పిరికి - గంభీరమైన జీవులు సంచరించే భారతదేశంలోని సందడిగా ఉండే అరణ్యాలలో అంబా అనే కాలాతీత వారసత్వం కలిగిన పులి కథను తెరపై చూడొచ్చు. ఈ ఆడపులి తన పిల్లలను చాలా ప్రేమతో చూసుకుంటుంది. తల్లి - బిడ్డల మధ్య ఉన్న అందమైన బంధం చాలా అద్భుతంగా తెరపై ఆవిష్కరించారు. ఈ అందమైన కుటుంబాన్ని తెరపై నేచురల్ గా చూపించాలంటే అంత సులువు కాదు. అందుకోసమే ఏకంగా 8 సంవత్సరాల పాటు ఈ చిత్రాన్ని చిత్రీకరించారు.వరల్డ్ ఎర్త్ డేగా జరుపుకునే ఏప్రిల్ 22న %--%టైగర్%--% ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రిలీజ్ తేదీని వెల్లడిస్తూ పీసీ సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఈ అద్భుతమైన కథకు నా గాత్రాన్ని అందించడం ..ఈ చిత్రం ద్వారా అరణ్యాలను అన్వేషించడాన్ని నేను చాలా ఆనందించాను. మీరు మాతో కలిసి అడవిని ఆస్వాధించడానికి వేచి ఉండలేను! టైగర్ ఈ ఎర్త్ డే రోజు అంటే.. ఏప్రిల్ 22న థియేటర్లలో ప్రదర్శితం కానుంది.. అని అన్నారు.ప్రియాంక చోప్రా ఇటీవల భర్త నిక్ జోనాస్ - కుమార్తె మాల్తీ మేరీ జోనాస్‌తో కలిసి భారతదేశంలో ఉన్నారు.ఇటీవల ముంబైలోని జియో వరల్డ్ ప్లాజాలో బల్గారీ గ్రాండ్ స్టోర్‌ను కూడా ప్రారంభించింది. ఈ బ్రాండ్‌కు ప్రపంచ బ్రాండ్ అంబాసిడర్‌లలో పీసీ ఒకరు. అనంతరం మార్చి 18న నిక్ ముంబై చేరుకున్నారు. ఈ ఏడాది నిక్ భారత్‌కు రావడం ఇది రెండోసారి. నిక్, అతడి సోదరులు కెవిన్ - జో జోనాస్ జనవరిలో లోల్లపలూజా ఇండియా మ్యూజిక్ ఈవెంట్‌లో ప్రదర్శన ఇచ్చారు.తిరిగి అమెరికాకు వెళ్లే ముందు, ప్రియాంక -నిక్ జోనాస్ ముంబైలో తన బంధువు కం నటి మన్నారా చోప్రా పుట్టినరోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఈ అందమైన జంట ఎంతో ముచ్చటగా కనిపించారు. దీనికి ముందు ప్రియాంక- నిక్ జోడీ నోయిడాలో మన్నారా ఆమె కుటుంబ సభ్యులు - స్నేహితులతో కలిసి హోలీ జరుపుకున్నారు.కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ప్రియాంక %--%హెడ్స్ ఆఫ్ స్టేట్%--%లో జాన్ సెనా- ఇద్రిస్ ఎల్బాలతో కలిసి కనిపించనుంది. కత్రినా కైఫ్ - అలియా భట్‌లతో కలిసి ఫర్హాన్ అక్తర్ దర్శకత్వం వహించనున్న 'జీ లే జరా'లో కనిపించనుంది. అయితే రెండేళ్ల క్రితం ఈ సినిమా ప్రకటన వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అప్‌డేట్ రాలేదు.

PRINTED, PUBLISHED AND OWNED BY RAVU RAJITHA, PRINTED AT M/s KAKATIYA PRINTERS, 24-91/72/1,BLOCK NO 29, PLOT NO 72,73 AND 74, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, UPPAL MANDAL, MEDCHAL -MALKAJGIRI DISTRICT, TELANGANA – 500039, PUBLISHED AT 11-1/B/42, BPM GREEN LANDS COLONY, BEHIND AMMA SHABARI GARDEN, PEERZADIGUDA, MEDIPALLY MANDAL, MEDCHAL - MALKAJGIRI DISTRICT-500098, TELANGANA STATE.. **EDITOR** : RAVU NAGIREDDY, RNI TITLE CODE : TELTEL12309, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com